



ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 338 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | శుక్రవారం 11 జూలై 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# కాకినాడ రంగరాయ వైద్యకళాశాల ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

**అమరావతి, జూలై 11, (రిపబ్లిక్ న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల ఘటనపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి వైద్యారోగ్యశాఖ అధికారులు సీఎంకు నివేదిక అందించారు.



నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ల్యాబ్ టెక్నీషియన్లు జిమ్మీ రాజు, గోపాలకృష్ణ, ప్రసాద్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. రంగరాయ వైద్యకళాశాలలో బీఎస్సీ, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ కోర్సుల విద్యార్థినుల పట్ల కొందరు సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అంశం వెలుగుచూసింది. ముఖ్యంగా ల్యాబ్ సహాయకుడు ఒకరు, మరో ఉద్యోగి వికృత చేష్టలపై కళాశాల ప్రిన్సిపల్కు ఫిర్యాదు అందింది. ఈ నెల 8న కొందరు విద్యార్థినులు ఫ్యాకల్టీ వద్ద విలపించడంతో కళాశాల అంతర్గత కమిటీ ద్వారా విచారణ జరిపించారు. మైక్రోబయాలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల్లో కొందరు సిబ్బంది తమ పట్ల అసభ్యంగా వ్యవహరించిన తీరును దాదాపు 50 మంది విద్యార్థినులు కమిటీ ముందు చెప్పారు.

# హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు:ఏపీ డిప్యూటీ సీఎం పవన్

**హైదరాబాద్, జూలై 11, (రిపబ్లిక్ న్యూస్):** విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాల కోసం భాషతో సంబంధం లేకుండా ముందుకెళ్తున్న ప్రస్తుత రోజుల్లో హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అలా చేయడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందన్నారు.





గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకలకు పవన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. "హిందీలో డబ్ అయిన 31 శాతం సౌత్ ఇండియన్ సినిమాలు ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. వ్యాపారానికి హిందీ కావాలి కానీ, నేర్చుకోవడానికి ఎందుకు ఇబ్బంది. హిందీ నేర్చుకోవడమంటే మన ఉనికిని కోల్పోవడం కాదు. ఇంకో భాషను అంగీకరించడమంటే ఓడిపోవడం కాదు.. కలిసి ప్రయాణించడం" అని పవన్ కల్యాణ్ అన్నారు. వేడుకల్లో భాగంగా దక్షిణ సంవాదం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, కేంద్రమంత్రి కిషన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 75 ఏళ్లకు రిటైర్మెంట్.. మోదీ గురించేనా?:ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పోస్ట్


**దిల్లీ, జూలై 11, (రిపబ్లిక్ న్యూస్):** ఎవరైనా సరే 75 ఏళ్లు రాగానే రిటైర్మెంట్ తీసుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దీనిపై కాంగ్రెస్ స్పందిస్తూ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించింది. మోదీని ఉద్దేశించే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని ఎద్దేవా చేసింది.



అసలేం జరిగిందంటే.. ఇటీవల మహారాష్ట్రలోని నాగ్పుర్లో జరిగిన ఓ కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. రిటైర్మెంట్పై మరాఠా సామ్రాజ్య మొదటి పీష్వా, సంఘ్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే అభిప్రాయాన్ని ప్రస్తావించారు. "75 ఏళ్ల శాలువా మన మీద కప్పారంటే.. మనం ఒక నిర్దిష్ట వయసుకు చేరుకున్నామని అర్థం. అప్పుడు మనం పక్కకు జరిగి.. వేరే వాళ్లు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలి" అని పింగ్లే వ్యాఖ్యలను భాగవత్ గుర్తుచేశారు. ఇది కాస్తా నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది సెప్టెంబరుతో ప్రధాని మోదీకి 75 ఏళ్లు నిండుతాయి. ఆయనను ఉద్దేశించే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. "పలు అవార్డులు తీసుకొని, విదేశీ పర్యటనలు ముగించుకుని వస్తున్న ప్రధాని మోదీకి ఎలాంటి స్వాగతం లభించిందో చూడండి..! ఈ ఏడాది సెప్టెంబరు 17 నాటికి మోదీకి 75 ఏళ్లు పూర్తవుతాయనే విషయాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ గుర్తుచేస్తున్నారు. కానీ, భాగవత్ కు కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నాటికి 75 ఏళ్లు నిండుతాయనే విషయాన్ని మోదీ గుర్తు చేయాలి" అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ పోస్ట్ పెట్టారు. 'ఒక్క దెబ్బకు.. రెండు పిట్టలు' అంటూ ఎద్దేవా చేశారు. ఈ ఏడాది మార్చిలో ప్రధాని మోదీ నాగ్పురలోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే మోదీ రిటైర్మెంట్ గురించి చర్చ మొదలైంది. అప్పట్లో దీనిపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "గత 10, 11 ఏళ్లలో మోదీ ఎన్నడూ ఈ కార్యాలయానికి రాలేదు. దేశ నాయకత్వంలో మార్పు రావాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటోంది. ఆ సంస్థ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని సంఘ్ భావిస్తోంది" అని నాడు రౌత్ వ్యాఖ్యానించారు. అయితే, దీన్ని భాజపా కొట్టిపారేసింది. ఇప్పుడు భాగవత్ వ్యాఖ్యలతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది.

# బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్.. రైల్ రోకో వాయిదా:ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, జూలై 11, (రిపబ్లిక్ న్యూస్):** బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని తెలంగాణ బీసీ బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. అంతకుముందు బంజారాహిల్స్లోని తన నివాసం నుంచి జాగృతి శ్రేణులతో ర్యాలీగా లోయర్ ట్యాంక్బండ్కు వెళ్లారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె నివాళులర్పించారు.



"స్థానిక ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నాం. అయితే మాకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయి. ఆర్డినెన్స్ ఇచ్చి వెంటనే రిజర్వేషన్లు అమలు చేయగలిగితే అధికారంలోకి వచ్చిన 18 నెలలు ఎందుకు ఆగారు? రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని మేం భావిస్తున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తున్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బంది పడుతున్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయి. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్నందున భాజపా అనుకుంటే ఒకే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదు.. కానీ ఇవ్వడం లేదు. దోషమంతా కాంగ్రెస్పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమో. ప్రజలు గమనిస్తున్నారు. బీసీ బిల్లును షెడ్యూల్-9లో పెట్టాలి. దీనికోసం బీసీ బిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలి. ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పినందున ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనిస్తాం. దీనిపై ముందుకెళ్లకపోతే రైల్ రోకో చేపడతాం" అని కవిత అన్నారు.

# జనాభా నియంత్రణ కాదు.. నిర్వహణ చేయాలి:సీఎం చంద్రబాబు

**అమరావతి, జూలై 11, (రిపబ్లిక్ న్యూస్):** జనాభా నియంత్రణ కాదు.. నిర్వహణ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వెలగపూడిలోని సచివాలయం వద్ద ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. జనాభా అనేది భారం కాకుండా ఆస్తిగా భావించే కాలం వచ్చిందని వ్యాఖ్యానించారు.



భారతదేశంలో ఎక్కువ జనాభా ఉండటం మనకు పెద్ద వనరని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యువశక్తి క్షీణించి అభివృద్ధి కూడా తగ్గిపోతోందన్నారు. ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకున్న తెలుగువారు అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. దేశమంటే మనుషులు అనే నినాదానికి సార్థకత చేకూరాలని సీఎం అన్నారు. గురజాడ చెప్పిన స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. "ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి అర్హత లేదని గతంలో నేనే చట్టం తీసుకొచ్చా. జనాభా నియంత్రణ కాదు.. జనాభా నిర్వహణ చేయాలి. దీనిపై సూచనలు ఇవ్వాలని కోరుతున్నామంటే అదీ మార్పు. పరిస్థితులకు అనుగుణంగా పాలసీలు మార్చుకోకపోతే చాలా సమస్యలు వస్తాయి. మంచి పాలసీ ఏవిధంగా తేవాలని ఇక్కడ మనం కూర్చొని ఆలోచిస్తున్నాం. ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరిన సందర్భంగా 1985 జులై 11న మొదటిసారి ఐరాస ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించింది. గతంలో జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవాళ్లు. ఇప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలపై ఆధారపడే పరిస్థితి వచ్చింది. జనమే ప్రధాన ఆస్తిగా భావించే రోజులు వచ్చాయి. ప్రత్యుత్పత్తి రేటు 2.1గా ఉంటే జనాభా పెరుగుదల స్థిరంగా ఉంటుంది. మన రాష్ట్రంలో ప్రత్యుత్పత్తి రేటు 1.8గా ఉంది.. ఇది మెరుగుపడాలి" అని సీఎం అన్నారు.



# మేం ప్రభుత్వ సంస్థల్ని స్థాపిస్తే.. భాజపా ప్రైవేటు పరం చేస్తోంది:ఖర్గే

**భువనేశ్వర్, జూలై 11, (రిపబ్లిక్ న్యూస్):** భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. రాజ్యాంగం నుంచి లౌకికవాదం, సామ్యవాద స్ఫూర్తిని తొలగించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భువనేశ్వర్లో శుక్రవారం నిర్వహించిన 'సంవిధాన్ బచావో' కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు.



భాజపా నాయకత్వంలో వ్యవస్థలు అతలాకుతలమయ్యాయని మండిపడ్డారు. భాజపా ప్రభుత్వం ప్రజల హక్కుల్ని కాలరాస్తోందని దుయ్యబట్టారు. తమ హక్కుల కోసం దళితులు, ఆదివాసీలు, యువత ఎలా పోరాడాలో తెలుసుకోవాలన్నారు. ఒడిశాలోని ప్రభుత్వ అధికారులు, దళితులపై భాజపా మద్దతుదారులు దాడులకు దిగుతున్నారని, ఇది సరికాదని ఖర్గే హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో దేశవ్యాప్తంగా 160 ప్రభుత్వరంగ సంస్థల్ని ఏర్పాటు చేస్తే.. భాజపా ప్రభుత్వం వాటిలో 23 సంస్థల్ని ప్రైవేటీకరణ చేసిందని మండిపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం పని చేయడం లేదని, ప్రైవేటు వ్యక్తులకు వత్తాసు పలుకుతోందని విమర్శించారు.

# కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తోంది:భట్టి విక్రమార్క

**దిల్లీ, జూలై 11, (రిపబ్లిక్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను భాజపా ప్రభుత్వం హరిస్తోందన్నారు.





"రోహిత్ వేముల తన సూసైడ్ నోట్లో కారణాలు వెల్లడించారు. రోహిత్ వేముల ఘటన జరిగినప్పుడు రాహుల్గాంధీ హెచ్సీయూకు వచ్చి విద్యార్థులకు మద్దతిచ్చారు. ఏబీవీపీ, ఏఎస్ఏ మధ్య ఘర్షణ జరిగినప్పుడు భాజపా నేత రామచంద్రరావు హెచ్సీయూకి వెళ్లి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. రోహిత్ వేములతో పాటు మరో నలుగురు విద్యార్థులను యూనివర్సిటీ నుంచి సస్పెండ్ చేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఈఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దళిత, ఆదివాసీలను భాజపా చిన్నచూపు చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం చర్యలను మేధావులు వ్యతిరేకించాలి" అని భట్టి విక్రమార్క అన్నారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- మంగోలియా జాతీయదినోత్సవం
- ప్రపంచ జనాభా దినోత్సవం
- తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవం
- 1877: హైదరాబాదుకు చెందిన ఇంజనీరు అలీ నవాజ్ జంగ్ బహదూర్ జననం (మ.1949).
- 1907: రంగస్థల నటుడు, తెలుగు సినీ నటుడు సి.యస్.ఆర్. ఆంజనేయులు జననం (మ.1963). (చిత్రంలో)
- 1955: భారతీయ స్టేట్ బ్యాంకు స్థాపించబడింది.
- 1964: తెలుగు, తమిళ సినీ సంగీత దర్శకుడు మణిశర్మ జననం.
- 1987: ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరుకుంది. అందుకే, ఈ రోజును ప్రపంచ జనాభా దినోత్సవం గా 1987 నుంచి జరుపు కంటున్నారు.
- 2007: తెలుగు సినిమా నటుడు శ్రీధర్ మరణం (జ.1939).


మంగోలియా



ప్రపంచ జనాభా దినోత్సవం




తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవం


అలీ నవాజ్ జంగ్ బహదూర్


సి.యస్.ఆర్. ఆంజనేయులు


భారతీయ స్టేట్ బ్యాంకు


మణిశర్మ



ప్రపంచ జనాభా దినోత్సవం


శ్రీధర్

## ఓటీటీలోకి 'కుబేర'.. అధికారికంగా ప్రకటించిన సంస్థ




శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్. నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం సినీప్రియుల్ని ఆకట్టుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జులై 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గత కొన్ని రోజులుగా దీని ఓటీటీ విడుదలపై ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ.. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అమెజాన్ ఓ పోస్టర్ విడుదల చేసింది.

**కథేంటంటే:** దేశంలోనే అత్యంత సంపన్నుడైన గ్లోబల్ ఎంటర్ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్భ్) ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలవాలని కలలు కంటుంటాడు. ఆ కల కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ ప్రాజెక్టును వినియోగించుకోవాలనుకుంటాడు. రూ. లక్ష కోట్ల డీల్ కుదుర్చుకుంటాడు. ఆ మొత్తం డబ్బులో రూ.50 వేల కోట్లు బ్లాక్ .. మిగిలిన డబ్బు వైట్లో ఇవ్వాలని నీరజ్కు సిద్ధప్ప షరతు విధిస్తాడు. ఈ పనిని సమర్థంగా చేయడం కోసం జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జున)ను బయటకు తీసుకొస్తాడు. ఈ పని కోసం దీపక్ బిచ్చగాళ్లను ఎంచుకుంటాడు. ఈ పని పూర్తి కాగానే ఆ నలుగురు బిచ్చగాళ్లను చంపేయాలని నీరజ్ ప్లాన్ చేయగా.. వారిలో ఒకడైన దేవా (ధనుష్) తప్పించుకుంటాడు. మరి వీళ్ల చేతికి దేవా దొరికాడా? తన ఖాతాలో ఉన్న వేల కోట్ల డబ్బును దేవా ఏం చేశాడు? అన్నది మిగిలిన కథ.


## 'రామాయణ'.. హనుమంతుడి పాత్ర 15 నిమిషాలే!



బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారి రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్టాత్మకంగా ఇది రూపొందుతోంది. ఇటీవల ఇందులోని పాత్రలను పరిచయం చేస్తూ వీడియోను విడుదల చేయగా దానికి మంచి ఆదరణ లభించింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్గా మారింది. ఇందులో హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ నటుడు సన్నీ దేవోల్ కనిపించనున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండు పార్టులుగా రానున్న ఈ సినిమా మొదటిభాగంలో ఆయన పాత్ర నిడివి చాలా తక్కువగా ఉండనున్నట్లు సమాచారం. 15 నిమిషాలు మాత్రమే కనిపిస్తారట. రెండో భాగంలో ఆయన పాత్రే కీలకం కానున్నట్లు తెలుస్తోంది. పార్ట్ 2లో ఎక్కువ సేపు కనిపించనున్నారట. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ ఈ వార్త మాత్రం సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఇందులో రాముడి పాత్రలో రణ్బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. జటాయువు పాత్రకు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇవ్వనున్నట్లు సమాచారం. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమా మొదటిభాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది. రెండో భాగం 2027లో విడుదల కానుంది.



## ఓటీటీలోకి 'కలియుగం-2064'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!



శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కలియుగం-2064'. ప్రమోద్ సుందర్ దర్శకత్వంలో రూపొందింది. తమిళ, తెలుగు భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రం మే 9న విడుదలైంది. ఇప్పుడీ మూవీ సైలెంట్గా ఓటీటీలోకి వచ్చేసింది. ఆహా వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.గతేడాది సైన్స్ ఫిక్షన్ మూవీ 'కల్కి 2898 ఏడీ' ప్రేక్షకుల ముందుకువచ్చి ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇదేతరహాలో 'కలియుగం-2064'ను రూపొందించారు. గ్రాఫిక్స్కు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. 2064 సంవత్సరంలో ఈ మానవాళికి ఏమవుతుంది.. ఎలాంటి మార్పులు సంభవిస్తాయి? అనే విషయాల్ని ఆధారంగా చేసుకొని తెరకెక్కించారు.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని, అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/161/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్



## మనం హాలిడేకు రాలేదు.. దేశం కోసం ఆడేందుకు వచ్చాం:గౌతమ్ గంభీర్




గత ఆసీస్ పర్యటనలో టీమ్ ఇండియా ఘోర పరాభవం చూవిచూసింది. దీంతో ఆటగాళ్లతోపాటు సిబ్బంది విషయంలో బీసీసీఐ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. వీటిపై కోహ్లి వంటి సీనియర్ కాస్త అసహనం వ్యక్తంచేశాడు. కుటుంబసభ్యులతో కాకుండా జట్టుతోనే ప్రయాణం చేయాల్సి ఉండటం అందులో ముఖ్యమైంది. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఎక్కువ సమయం కుటుంబానికి కాకుండా ఆటకే కేటాయించాలని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతం టీన్ఇండియా ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. దీనికి ముందు తన తల్లి అనారోగ్యం దృష్ట్యా గంభీర్ కూడా స్వదేశానికి వచ్చి మళ్లీ వెంటనే ఇంగ్లాండ్కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఈసందర్భంగా భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బీసీసీఐ నిబంధనలపై కీలక వ్యాఖ్యలు చేశాడు. ఛతేశ్వర్ పుజారాతో ముఖాముఖిలో గంభీర్ తన అభిప్రాయాలను వెల్లడించాడు. "ప్రతిఒక్కరికీ కుటుంబాలు చాలా ముఖ్యమే. ఇక్కడ ఓ విషయం అర్థం చేసుకోవాలి. మనం ఇక్కడికి వచ్చిన కారణం వేరు. ఇదేమీ హాలీడే కాదు. ఏదైనా పర్యటనకు వెళ్లినప్పుడు డ్రెస్సింగ్ రూమ్లో చాలా తక్కువమందితో ఉండాల్సి ఉంటుంది. వారితో పనిచేసి దేశం గర్వపడేలా చేయాలి. మాతో కుటుంబాలు ఉండకపోవడానికి వ్యతిరేకం కాదు. ఫ్యామిలీకి సమయం కేటాయించాలి. అదే సమయంలో దేశం కోసం ఆడేందుకు వచ్చినప్పుడు మన దృష్టి ఇక్కడే ఉండాలి. ఆ లక్ష్యానికి కట్టుబడి ఉండాలి. ఇప్పుడంతా బాగానే ఉందనుకుంటున్నా. నావరకైతే ఇతర విషయాల కంటే నాకు ఈ లక్ష్యమే ఎక్కువ" అని గంభీర్ వ్యాఖ్యానించాడు. గతంలో విరాట్ కోహ్లి మాత్రం విభిన్నంగా స్పందించాడు. దీనివల్లే అతడు టెస్టు కెరీర్ను త్వరగా ముగించి ఉంటాడని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

### ప్రతిరోజూ నేర్చుకోవాల్సిందే

"నాతోపాటు ఎవరైనా సరే నేర్చుకోవాల్సిందే. మెరుగవ్వాలి. పోటీపడాలి. ప్రతిరోజూ మనకు పోరాటమే. మూడు రంగుల తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు తప్పదు. ఇక్కడ గంభీర్ ముఖ్యం కాదు. భారత క్రికెట్కే ప్రాధాన్యం. ప్రతిఒక్కరికీ తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉంది. డ్రెస్సింగ్ రూమ్ కల్చర్ గురించి మాట్లాడుకోవచ్చు. నాకు ప్రతిఒక్కరి ఒపీనియన్ ముఖ్యమే. మన విజయంలో కుటుంబ పాత్ర చాలా ఎక్కువ" అని గంభీర్ వ్యాఖ్యానించాడు.

## ఇంటి చిట్కాలు

## మహిళల్లో ఓ విటమిన్ లోపం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు

### ఏ విటమిన్ తక్కువగా ఉంటే ప్రమాదమో తెలుసా

విటమిన్ డి లోపాన్ని చాలా మంది లైట్ తీసుకుంటారు. కానీ..మహిళల్లో ఇది బ్రెస్ట్ క్యాన్సర్ కి దారి తీస్తోందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. సరైన మోతాదులో విటమిన్ డి అందకపోతే బ్రెస్ట్ హెల్త్ పాడైపోతుందని వెల్లడించాయి.

బ్రెస్ట్ క్యాన్సర్. ఇప్పుడీ వ్యాధి కూడా చాలా సాధారణమైపోయింది. బీపీ, షుగర్ వచ్చినంత సులువుగా క్యాన్సర్ విస్తరిస్తోంది. అందుకే రెగ్యులర్ చెకప్స్ చేయించుకోవడం మంచిదని మహిళలకు వైద్యులు సూచిస్తున్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని సరైన విధంగా గుర్తిస్తే మొదటి దశలోనే చికిత్స తీసుకుని ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. అయితే..ఇటీవల జరిగిన ఓ అధ్యయనంలో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చిన వారిలో కామన్ గా ఓ సింప్టమ్ మాత్రం కనిపించింది. అదేంటంటే.. విటమిన్ లోపం. ముఖ్యంగా డి విటమిన్ లోపం ఉన్న వారికే ఈ ముప్పు ఎక్కువగా కనిపించింది. దాదాపు మూడేళ్ల క్రితమే ఇందుకు సంబంధించిన పరిశోధన జరగ్గా..ఇందుకు సంబంధించిన వివరాలు ఇప్పుడు చర్చకు దారి తీశాయి. అసలు విటమిన్ డి లోపం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ ఎందుకు వస్తుంది. ఈ రెండింటి మధ్య లింక్ ఏంటో డిటైల్డ్ గా చూద్దాం.




**గమనిక**

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.



### విటమిన్ డి




ఇమ్యూనిటీ బాగుండాలన్నా, కండరాలు బలంగా ఉండాలన్నా విటమిన్ డి తప్పనిసరిగా ఉండాలి. ఇది చాలా సహజంగా సూర్యరశ్మి ద్వారా అందుతుంది. ఫిష్, గుడ్లు, పాలు, తృణ ధాన్యాల ద్వారా కూడా విటమిన్ డి శరీరానికి అందుతుంది. అయితే..కొంత మందిలో ఈ విటమిన్ లోపం ఉంటుంది. ఆ సమయంలో రకరకాల లక్షణాలు కనిపిస్తాయి. ఏ చిన్న పని చేసినా విపరీతంగా అలిసిపోతారు. దీంతో పాటు కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడతారు. ఇక కండరాల నొప్పులూ వేధిస్తాయి. ఈ సింప్టమ్స్ కనిపించాయంటే వెంటనే అప్రమత్తం అవ్వాలి. అయితే..కేవలం ఈ సమస్యలే కాదు. విటమిన్ డి లోపంతో బ్రెస్ట్ క్యాన్సర్ కూడా వచ్చే ముప్పు ఉందని ఓ అధ్యయం వెల్లడించింది. 2022లో జరిగిన పరిశోధన గురించి ఇప్పుడు చర్చ జరుగుతోంది. విటమిన్ డి లోపం చాలా మందిలో కనిపిస్తుండడం వల్ల దీనిపై అందరూ మాట్లాడుతున్నారు. మరి విటమిన్ డి లోపంతో బ్రెస్ట్ క్యాన్సర్ కి లింక్ ఏంటో తెలుసుకుందాం.

### బ్రెస్ట్ క్యాన్సర్



ప్రపంచవ్యాప్తంగా దాదాపు మూడేళ్లలో బ్రెస్ట్ క్యాన్సర్ పై రకరకాల పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే..అన్ని అధ్యయనాల ఆధారంగా చూస్తే విటమిన్ డి లోపం ఉన్న మహిళల్లో ఈ బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఈ క్యాన్సర్ వచ్చిన వారిలో సుమారు 96 శాతం మందిలో విటమిన్ డి లోపం ఉంటోంది. ఇందుకు ప్రధాన కారణం ఏంటంటే..విటమిన్ డి అనేది కేవలం కండరాల ఆరోగ్యాన్నే కాదు. బ్రెస్ట్ హెల్త్ ని కాపాడడంలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. అమెరికాలో ఈ పరిశోధన జరిగినప్పటికీ యూనివర్సల్ గా అందరికీ ఈ అధ్యయనం వర్తిస్తుందని చెబుతున్నారు నిపుణులు. మహిళలు విటమిన్ డి పై ఎక్కువగా ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ఈ లోపం ఉంటే వెంటనే అందుకు తగ్గట్టుగా సప్లిమెంట్స్ తీసుకోవటం మంచిదని సలహా ఇస్తున్నారు.

### విటమిన్ డి తో లాభమేంటి

మహిళల బ్రెస్ట్ లో పాలను ఉత్పత్తి చేసే మమ్మరీ గ్లాండ్స్ పని తీరుపై విటమిన్ డి ప్రభావం చూపిస్తుంది. విటమిన్ డి రిసెప్టార్ జీన్స్ కి, బ్రెస్ట్ హెల్త్ కి లింక్ ఉంటుంది. విటమిన్ డి రిసెప్టార్ జీన్స్..పాల ఉత్పత్తికి కూడా తోడ్పడుతుంది. ఎప్పుడైతే విటమిన్ డి లోపం తలెత్తుతుందో అప్పుడు బ్రెస్ట్ లో సమస్యలు మొదలవుతాయి. ఈ కారణంగానే క్యాన్సర్ కణాలు ఏర్పడతాయి. అయితే..కచ్చితంగా ఏ కారణం వల్ల ఇలా జరుగుతుందనే దానిపై ఇంకా అధ్యయనాలు జరుగుతున్నాయి. విటమిన్ డి లోపం ఉన్న మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు 27 శాతం అధికంగా ఉంటోంది. అంటే..20 ఎన్జీ, ఎంఎల్ కన్నా తక్కువగా ఉన్నప్పుడు ఈ సమస్య తలెత్తుతోంది. అయితే.. విటమిన్ డి సరైన విధంగా ఉన్న వారిలో మాత్రం ఈ ముప్పు తక్కువగానే ఉంటోంది.

### ఎంత ఉంటే మంచిది




విటమిన్ డి అనేది 30ఎన్జీ, ఎంఎల్ మేర ఉంటే సరైన మోతాదులో ఉన్నట్టు లెక్క. అంతకు మించి తగ్గితే రకరకాల సమస్యలు వస్తాయి. అందులో బ్రెస్ట్ క్యాన్సర్ కూడా ఒకటి. అయితే..ఇంతకు మించి మోతాదులో ఉన్న వారికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు చాలా అంటే చాలా తక్కువ అని చెబుతున్నాయి అధ్యయనాలు. 47 ఎన్జీ, ఎంఎల్ మేర విటమిన్ డి ఉన్న వారిలో 50 శాతం మేర బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు తగ్గినట్టు యాంటీ క్యాన్సర్ రీసెర్చ్ వెల్లడించింది. అయితే..50 ఎన్జీ, ఎంఎల్ కన్నా ఎక్కువగా ఉంటే మాత్రం దాదాపు అన్ని రోగాల నుంచి రక్షణ పొందినట్టే. ఎందుకంటే.. ఈ స్థాయిలో విటమిన్ డి ఉంటే అదే ఇమ్యూనిటీ బూస్టర్ లా పని చేస్తుంది. ఫలితంగా ఎలాంటి ఇన్ఫెక్షన్స్, సమస్యలు వచ్చే అవకాశం ఉండదు. మరి ఈ స్థాయిలో విటమిన్ డి ఉండాలంటే రోజుకు ఎంత విటమిన్ తీసుకోవాలో తెలుసా.

### రోజుకు ఎంత అవసరం




రోజుకు కనీసం 5 వేల ఇంటర్నేషనల్ యూనిట్స్ మేర విటమిన్ డి తీసుకోవాలని చెబుతున్నాయి అధ్యయనాలు. సగటున ఇంత మొత్తం తీసుకుంటే మొత్తంగా 50 ఎన్జీ, ఎంఎల్ అనే నంబర్ ని అచీవ్ చేయవచ్చు. అయితే..ఇది కేవలం మ్యాగ్జిమమ్ నంబర్ మాత్రమే. కచ్చితంగా ఇంత ఉండాలన్న రూల్ ఏమీ లేదు. ఈ స్థాయిలో విటమిన్ డి రావాలంటే రోజుకి కనీసం 50 గ్లాసుల పాలు తాగాలని లెక్క. ఎలాగో అది కుదరదు. ఈ నంబర్ గురించి ఆలోచించకుండా రెగ్యులర్ గా విటమిన్ డి ఎక్కువగా ఉండే గుడ్లు, పాలు తీసుకుంటే మంచిది. అదే సమయంలో సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.